కథ

# ఎవరు గొప్ప?

దేవలోకమంతా దడదడలాడుతోంది.

ఎలా మొదలయిందోకానీ లక్ష్మీదేవి, వాగ్దేవిల మధ్య చిన్నగా మొదలయిన వాగ్వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. బ్రహ్మదేవుడో ప్రక్క, విష్ణుదేవుడో ప్రక్క ఉండి అసహాయంగా చూస్తున్నారు రమా, వాణీల సిగపట్ల బాగోతాన్ని.

దేవతలంతా హాహాకారాలు చేస్తూ నిట్టూర్పులు విడుస్తూ చేతులు నులుముకుంటున్నారు.

ఏం చేయ్యాలో, ఈ వివాదం ఎలా అంతం చెయ్యాలో ఎవరికీ అర్థం కావడం లేదు.

''హు...నువ్వెంత?'' ఫీంకరించింది లక్ష్మీదేవి. ''ఏ కాలంలోనైనా నాకున్న విలువ నీకు లేదు. ధనరాశులకి జనం వంగి వంగి మొక్కుతారు. మొక్కుతూనే ఉంటారు. ఎంత జ్ఞానులైనా సరే, మహా పండితులైనా సరే నా వద్దు 'దాసోహం' అవవలసిందే. నేను లేనిదే వారి ప్రతిభకి గుర్తింపూ లేదు, రాణింపూ లేదు''

''అది నీ అభిప్రాయం కాబోలు. చరిత్ర తిరగేసి చూడు. పండితులనీ, జ్ఞానులనీ కాసులకధిపతులైన రాజులు కాళ్లు కడిగి తమ శక్తి కొలదీ సత్కరించారు. పాదాభిషేకాలు చేశారు. కనకాభిషేకాలు చేశారు. సగం రాజ్యం ఇచ్చి తరించారు. ఊళ్లనిచ్చారు. బంగారు పల్లకీలో ఊరేగించారు. ఆఖరుకి పల్లకీ కూడా మోశారు. వాణీ కటాక్షం ఉన్నచోటుకు లక్ష్మీదేవి నడిచి రావాల్సిందే'' బ్రహ్మ సతి దర్పంగా చురక అంటించింది.

ఎవరో ఒకరు సర్ది చెప్పకపోతే ఈ గొడవ ఎక్కడికి పోతుందో అని దేవతలంతా గడగడలాడారు. చివరికి ధైర్యం కూడగట్టుకున్నారు.

''ఇద్దరూ రెండు బండి చక్రాలంటి వాళ్లమ్మా. ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కాకుండా సమానంగా సమంగా తూగినట్టు ఇద్దరూ గొప్పవాళ్లే'' దేవతలంతా తమ చతురత నంతా ఒలకబోసి సర్దిచెప్పబోయారు.

వాళ్ల మీద గయ్యిమని లేచారు రమా, వాణీ.

''ఆవిడ నాకు సాటా?'' వీణాపాణి హేళనగా అంది.

''ఓయబ్బో! నీ దయ ఉన్నవాళ్లంతా నా కటాక్షవీక్షణాల కోసం రాజులనాశ్రయించారు. నిన్ను నమ్మి నన్ను సంపాదించాలని వాళ్ల కావ్యాలు రాజులకు అంకితమిచ్చారు. నా బిడ్డల మీద కావ్యాలు రాశారు. స్తోత్రాలు చేశారు. ఇంకా చెప్పకమ్మా నీ గొప్పలు'' లక్ష్మీదేవి ముక్కు మూతీ తిప్పింది.

''ఏవమ్మా, పార్వతమ్మా నువ్వయినా చెప్పమ్మా మా ఇద్దరిలో ఎవరు గొప్పో?'' బ్రహ్మ సతి, విష్ణుసతీ అపర్ణాదేవిని నిలేశారు.

వారి తగవుని 'ఫ్రీ'గా సినిమా చూస్తున్నంత సంబరంగా చూస్తున్న ముక్కంటి సతి గుండె గుభేలుమంది.

''మీ తగవు తీర్చేంత శక్తి నాకేదమ్మా? పశుపతి పాదసేవకి వేళయింది నే వస్తా'' పార్వతమ్మ మెల్లగా కైలాసానికి జారుకుంది.

రమాదేవికీ, వాగ్దేవికీ నచ్చచెప్పే ధైర్యం, సామర్థ్యమూ లేక దేవతలంతా దీనవదనాలతో ఖిన్నులై ఈ తగవు ఎలా ముగుస్తుందో అని చింతాక్రాంతులయ్యారు.

అత్తాకోడళ్ల సంవాదం. పైగా ఇద్దరికిద్దరూ మంచి మహత్తు ఉన్నవాళ్లు. ఏం చెప్తే ఎవరి క్రోధ వీక్షణాలకి బలి కావలసి వస్తుందో అని అందరికీ భయమే. ఇద్దరి కృపా ఉన్నవాళ్లే కదా ధన్యజీవులు. కానీ ఈ ఇద్దరమ్మల వ్యవహారం చూస్తుంటే లక్ష్మి ఉన్నచోట వాణి ఉండదు. వాణి ఉన్నచోట లక్ష్మి కాలు పెట్టదు అని నిశ్చయంగా తేలిపోతోంది. రానున్న రోజుల్లో మానవాధముల గతి ఏమవుతుందో కదా అని దేవతలంతా దిగులుపడిపోయారు.

రోజులు, నెలలు, వత్సరాలు, యుగాలు గడుస్తున్నాయి.

విద్యాదేవి కటాక్షం పొందినవాళ్లు కటిక దరిద్రంతో కొట్టుమిట్టాడుతున్నారు. లక్ష్మీదేవి వాళ్ల వైపు కన్నెత్తి చూడడం కూడా మానుకుంది.

అమూల్యమైన గ్రంథాలు, కావ్యాలు రాసిన వాళ్లు పూట పూటా నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లడం కష్టమై నానా అవస్థలు పడ్డారు.

మీ గ్రంథాలు మాకంకితమిస్తే కనకరాశులు మీ ముందు కుప్పపోస్తాం అన్నారు లక్ష్మీపుత్రులు.

మమ్మల్ని స్తుతిస్తూ కావ్యాలూ, కవితలూ లిఖించండి సువర్ణరాశుల్లో తేలుస్తాం అన్నారు అవనీపతులు.

అయినా వినలేదు విద్వాంసులు.

''కాసుకి మేం అమ్ముడుపోతామా?'' అని అలాగే దారిద్ర్యంలో రోజులు వెళ్లమార్చారు.

చదువుల తల్లి కడుపు తరుక్కుపోయింది తన ముద్దుబిడ్డల పాట్లు చూసి.

సాగర పుత్రి కడుపూ తరుక్కుపోతోంది. లక్ష్మీపుత్రులంతా నిరక్షరకుక్షులుగా ఉన్నారు. కుప్పలుగా ఉన్న రాశులని ఎలా ఉపయోగించుకోవాలో కూడా తెలియని అయోమయావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. తన కటాక్షవీక్షణాలు దొరికిన వాళ్లు తెలివి, తేటా లేకుండా ఉన్నారు. తమ దగ్గర ఉన్న కాసులెన్నో, ఎంత వస్తోందో, ఎంత పోతోందో కూడా తెలియకుండా ఉన్నారని లక్ష్మీదేవి చింతలో మునిగింది.

దేవలోకం మీటింగుల్లో లక్ష్మీదేవి, సరస్వతీదేవి కలిసినా ఇంకా ఎడమొగం పెడమొగం గానే ఉన్నారు. ఇద్దరి మనస్సుల్లోనూ ఏదో అసంతృప్తి. డబ్బు ఉన్న చోట చదువు లేదు. చదువు ఉన్న చోట డబ్బు లేదు. ఎంత డబ్బు పోసినా లక్ష్మీపుత్రులకి నాలుగు అక్షరం ముక్కలు అబ్బటం లేదు. విద్యలరాణి వాళ్ల పాట్లు చూసి నవ్వుకుంది.

కడుపునిండా అక్షరం ముక్కలున్న వాళ్ల కడుపులు ఆకలితో మలమల కాలిపోతున్నాయి.

సిరులరాణి చిరునవ్వులు నవ్వుకుంది వాళ్ల అవస్థలు చూసి.

రోజులు దొర్లుతున్నాయి.

లక్ష్మీపుత్రులు తమ కాసుల లెక్కలు చూడడానికి ఇంట్లో శుభకార్యాలు జరపడానికీ వాణీపుత్రులని పిలవడం మొదలుపెట్టారు.

వాణీపుత్రులు వాళ్ల పనులు చేసిపెట్టి కాసుల మూటలు అందుకుంటున్నారు.

రమా, వాణీ చూసీచూడనట్టూ ఊరుకున్నారు ఈ వ్యవహారం చూస్తూ.

శ్రీదేవీ, శర్వాణీ నువ్వా? నేనా? అని వాదాలకి దిగడం మానేశారు.

ఇద్దరి కృపా ఉన్నవాళ్లు తప్ప మిగిలిన వాళ్లు అసంతృప్తిగానే ఉన్నారని ఇద్దరికీ అర్థమయిపోయింది.

ఇలా ఉండగా–

కలియుగం వచ్చేసింది.

ఓ శుభముహూర్తాన జంబూద్వీపంలో భరత ఖండంలో భారతదేశంలో 'మేరా భారత్ మహాన్' అని ప్రజలు జయజయధ్వానాలు చేస్తున్నారు.

బోలెడన్ని ప్రయివేట్ ఇంజనీరింగ్, మెడికల్, ఎం.బి.ఎ., ఎం.సి.ఎ., కాలేజీలు దేశమంతటా

కుక్కగొడుగుల్లా వచ్చేశాయి.

యూనేమ్ ఇట్ యూ హేవ్ ఇట్. చదుకోనక్కరలేకుండానే సర్టిఫికెట్లు అమ్మే సంస్థలు వచ్చాయి.

లక్ష్మీపుత్రులంతా లక్షలు, కోట్లు గుమ్మరించి కాలేజీ సీట్లు కొనేసుకుంటున్నారు. దొంగ సర్టిఫికెట్లు తెచ్చేసుకుంటున్నారు.

ఆఖరికి చదువుల రాణిని కొనెయ్యగలుగుతున్నాను కదా అని సిరులరాణి చిరునవ్వులు చిందించింది.

''నీకంటే నేనే గొప్ప తెలిసిందా?'' అని సరస్వతమ్మ ముందు దర్పం ఒలకబోయాలనుకుంది. ఓసారి అలా అన్ని వైపులా దృష్టి సారించి ఉలిక్కిపడింది.



ఇదేమిటి? వాణీపుత్రులు అర కడుపులతో మాడడం లేదు. తక్కువ ఖర్చుతో, స్కాలర్‌షిప్పులతో తెగ చదివేస్తున్నారు. ఇలా కళ్ళు మూసి తెరిచేలోగా అమెరికాకి ఎగిరిపోయి లక్ష్మీపుత్రులను మించిన లక్ష్మీపుత్రులయిపోతున్నారు. వాణీపుత్రులు సంపాదన ముందు లక్ష్మీపుత్రుల సిరులు వెలవెలబోతున్నాయి.

''చూశావా! నా విద్యల వల్ల వాళ్లెంతగా నిన్ను పొందుతున్నారో నేనే నీ కంటే గొప్ప'' అని గొప్పలు చెప్పుకోవాలనుకున్న గీర్వాణి ప్రపంచాన్నోమారు కలయజూసి ఖంగుతింది.

లక్ష్మీపుత్రులు లక్షలు, కోట్లు గుమ్మరించి తన ముద్దుబిడ్డలతో సమానంగా చదివేస్తున్నారు. మార్కులు కొంటున్నారు. సీట్లు కొంటున్నారు. చదవకుండానే సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారు. గీర్వాణి గర్వం ఒక్క క్షణంలో తగ్గిపోయింది. 'హు..కలికాలం' అనుకుంది నిస్పృహగా.

లక్ష్మీదేవీ అలాగే అనుకుంది నిరాశగా. 'ఎవరు గొప్ప?' అనేది తేలలేదు కానీ ఇద్దరి మధ్యా వైరం అణిగిపోయింది.

దేవతలంతా ఊపిరి పీల్చుకుని 'అమ్మయ్య' అనుకున్నారు ఆనందంగా.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మురిసిపోయారు.

రమా, వాణీల మధ్య వైరాన్ని మట్టం చేసిన భారతదేశాన్ని చూసి దేవతలంతా జై జై అన్నారు భరత ఖండానికి, భారతదేశానికి. ''ఆప్ కా భారత్ మహాన్'' అని దేవతలంతా ఏకగ్రీవంగా అంగీకరించారు.

భారతీయుల తెలివికి జోహార్లు అర్పించారు.

ఎం. నాగలక్ష్మి

★★★

ఇండియన్స్ సాఫ్ట్‌వేర్ బుర్రల్లో అన్నేసి సొల్యూషన్స్ ఎలా దాగి ఉన్నాయబ్బా అని ఆ రహస్యం తెలియక అమెరికన్స్ కళవళ పడ్డారు.

ఇండియన్స్ వరదని అరికట్టకపోతే భారతీయులుండే దేశం ఏదీ అంటే 'అమెరికా' అనే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బిల్‌క్లింటన్, బిల్ గేట్స్ బెంగపెట్టుకున్నారు, లోపాయికారీగా కూపీలు లాగారు వారి విజయరహస్యం తెలుసుకోవాలని. గూఢచారులు కొంత సమాచారం మూటగట్టుకొచ్చారు.

''భారతీయుల్లో మంచి కాంపిటీటివ్ స్పిరిట్ ఉంది సార్. వాళ్లలోనే కాదు వాళ్ల దేవతల్లో కూడా'' అని విన్నవించుకున్నారు గూఢచారులు.

★